

## ఆదిత్యలో అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో 'ది సీక్రెట్ అఫ్ అల్టిమేట్ లివింగ్' అనే అంశంపై శనివారం అవగాహనా సదస్సును నిర్వహించారు. బి.టెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు జరిగిన ఈ సదస్సులో డాక్టర్ సచిన్ పరబ్ పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యకరమైన శరీరానికి ఒత్తిడి లేని జీవన శైలి ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, అడిమినిస్ట్రేషన్ డీన్ డాక్టర్ వైకెఎస్.సుబ్బారావు, అకాడెమిక్స్ డీన్ డాక్టర్ పి.రవికుమార్, విభాగ అధిపతి డాక్టర్ సి.రాజశేఖర్‌రెడ్డి, కో ఆర్డినేటర్స్ జి.కిరణ్‌కుమార్, ఎ.నసీముద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

# సంక్షోభంలో 'సంక్షేమ' విద్యార్థులు

- విడుదల కాని కాస్మొటిక్ ఛార్జీలు
- ట్యూటర్లకు వేతనాలు కరువు
- విద్యార్థులను వీడని సమస్యలు
- మెరుగైన ఫలితాలు సాధ్యమేనా...?



ట్యూషన్ చెబుతున్న ట్యూటర్

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జిల్లాలో సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. వసతి గృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పాలకులు గొప్పలు చెబుతున్నా ఆచరణలో అరకొర వసతులే కన్పిస్తున్నాయి. దీంతో పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వేలాది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓ వైపు మెస్, కాస్మొటిక్ ఛార్జీలు సరిపోవడం లేదు. మరోవైపు పూర్తి స్థాయిలో నిధులు విడుదల కావడం లేదు. ఇంకోపక్క ట్యూటర్లకు ఇచ్చే అరకొర వేతనాలు విడుదలలో ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంది. ఈ నేపథ్యంలో వచ్చే 10వ తరగతి ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. దీంతో మెరుగైన ఫలితాలు సాధ్యమేనా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

కాకినాడ జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 22 పోస్ట్ మెట్రిక్,12 ప్రీమెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో సుమారు 4 వేల మంది విద్యార్థులు ఏటా చదువుతున్నారు. బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 17 పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో 1058 మంది, 23 ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో 1048 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరిలో సుమారు 1000 మంది వరకూ 10వ తరగతి విద్యార్థులున్నారు.

**ట్యూటర్లకు వేతనాలేవి...?**

10వ తరగతి విద్యార్థులకు రాత్రి వేళల్లో ఒక్కో సబ్జెక్టుకు ఒకరు చొప్పున నాలుగు సబ్జెక్టులకు నలుగురు ట్యూటర్లతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుంటారు. వీరిని ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించింది. ఒక్కో ట్యూటర్‌కి రూ.1500 ఇవ్వాల్సి ఉంది. గత రెండేళ్లుగా ప్రభుత్వం వీరికి ఇచ్చే అరకొర వేతనాలు కూడా విడుదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ట్యూటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల వార్డెన్లు తమ సొంత సొమ్మును ఇచ్చి చదువులు చెప్పించే పరిస్థితి నెలకొంది. అది కూడా 2 నుంచి 3 నెలలు ఇస్తాము గాని నెలలు తరబడి సొంత డబ్బులు ఇచ్చేది ఎలా అంటూ కొందరు వార్డెన్లు చెబుతున్నారు. దీంతో 10వ తరగతి విద్యార్థులు పది ఫలితాలపై సందిగ్ధత నెలకొంది. జిల్లా వ్యాప్తంగా అన్ని హాస్టళ్లలో ఇదే పరిస్థితి కనిపిస్తుంది.

**సరిపోని మెస్‌ఛార్జీలు**

విద్యార్థులకు అందించే పౌష్టికాహారానికి ప్రభుత్వం ఇస్తున్న మెస్ ఛార్జీల నిధులు సరిపోవడం లేదు. రోజురోజుకి నిత్యావసర వస్తువుల ధరలు పైపైకి ఎగబాకుతున్న నేపథ్యంలో పిల్లలకు పౌష్టికాహారం అందడం లేదు. సరిపడని మెస్ ఛార్జీల ఫలితంగా హాస్టళ్లలో మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. ప్రస్తుతం ప్రభుత్వం 3 నుంచి 5 వరకు రూ.1150, 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు రూ.1400 మాత్రమే ఇస్తున్నది. పదో తరగతి విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం స్నాక్స్, టి ఇవ్వాల్సి ఉన్నా నిధుల కొరత కారణంగా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.

**విడుదల కాని కాస్మొటిక్ ఛార్జీలు**

అలాగే విద్యార్థులకు అవసరమైన ఇతర సౌకర్యాల కోసం ప్రతీ నెల కాస్మొటిక్ ఛార్జీలను ప్రభుత్వం ఇస్తుంది. ఒక్కో విద్యార్థికి రూ.160 నుంచి రూ.200 కాస్మొటిక్ చార్జీలను అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడాది కాలంగా కాస్మొటిక్ ఛార్జీలను ప్రభుత్వం విడుదల చేయడం లేదు. కాస్మొటిక్ ఛార్జీల బిల్లులకు బడ్జెట్ విడుదల అయిందని, త్వరలోనే పిల్లల ఖాతాల్లో జమ అవుతాయని జిల్లా అధికారులు చెబుతున్నారు.

**మెరుగైన ఫలితాలు వచ్చేదెలా...?**

మంచి పౌష్టికాహారం, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటే విద్యార్థులు పరీక్షలకు సిద్ధమయ్యే అవకాశం ఉంది. అయితే అనేక సమస్యల నడుమ సంక్షేమ వసతి గృహ విద్యార్థులు నలిగిపోతున్నారు. కనీస సౌకర్యాలు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇన్ని సమస్యలు నడుమ మెరుగైన ఫలితాలు ఏ విధంగా సాధించాలనేది ప్రస్తుతం ప్రశ్నర్థకంగా మారింది.

### రెండేళ్లుగా వేతనాలు లేవు

గత కొన్నేళ్లుగా హాస్టల్ పిల్లలకు ట్యూషన్ చెబుతున్నాను. 2 సంవత్సరాలుగా ప్రభుత్వం జీతాలు ఇవ్వడం లేదు.10 తరగతి పిల్లలకు రెండు సబ్జెక్టులను బోధిస్తున్నాను. ప్రభుత్వం స్పందించి ఇస్తున్న అరకొర వేతనాలను తక్షణమే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

**-ఎం. రామ్మోహన్, ట్యూటర్, బిసి, హాస్టల్, కాకినాడ**

## బెదిరింపులకు గురిచేయడం దారుణం



మీడియాతో మాట్లాడుతున్న దాడిశెట్టి రాజా

ప్రజాశక్తి - తుని

తుని మున్సిపల్ కౌన్సిలర్లను బెదిరింపులకు గురిచేసి లాక్కునిపోవడం దారుణమని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపికి చెందిన కౌన్సిలర్ల ఇండ్లపై దాడులు చేయడం, రౌడీషీట్ ఓపెన్ చేయిస్తామని బెదిరింపులకు గురి చేసి లాక్కుపోవడం సరి కాదన్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నికలు 2 దఫాలు వాయిదా పడటానికి టిడిపి పెద్దలే కారణమన్నారు. మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్ల హాల్లోకి టిడిపి గుండాలు వెళ్లి దౌర్జన్యంగా ప్రవర్తించడంపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశామని అన్నారు. మహిళా కౌన్సిలర్లు కోర్టును ఆశ్రయించటం జరిగిందని తెలిపారు. తుని మున్సిపాలిటీలో 30 మంది వైసిపికి చెందిన వారే కౌన్సిలర్లుగా గత ఎన్నికల్లో విజయం సాధించారని, టిడిపి కనీసం ఒక్క కౌన్సిలర్ కూడా లేరన్నారు. ఒక కౌన్సిలర్ మృతితో ప్రస్తుతానికి 29 మంది కౌన్సిలర్లు ఉన్నారని వివరించారు. మాజీ ఎంఎల్ఎ రాజా అశోక్ బాబు కౌన్సిలర్లను కిడ్నాప్ చేస్తానంటూ బెదిరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. అశోక్ బాబు ఇంత దిగజారుడి రాజకీయాలు చేయడం సరి కాదన్నారు. కూటమి నాయకులు ఎన్ని కుట్రలకు పాల్పడినా మున్సిపల్ ఎన్నికల్లో వైసిపిదే విజయమని ఆయన ధీమాను వ్యక్తం చేశారు.

## టిడిపిలోకి మరో ఐదుగురు కౌన్సిలర్లు



కౌన్సిలర్లను పార్టీలోకి ఆహ్వానిస్తున్న యనమల రామకృష్ణుడు

ప్రజాశక్తి - తుని

తుని నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాల వేగంగా మారిపోతున్నాయి. మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నికల ప్రక్రియ మొదలుకుని తుని పట్టణంలో టిడిపి, వైసిపిల మధ్య రాజకీయం వేడెక్కింది. వైసిపికి చెందిన మరో ఐదుగురు కౌన్సిలర్లు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు సమక్షంలో శనివారం టిడిపిలో చేరారు. ఈ నెల 12వ తేదీన కౌన్సిలర్లు కర్రి దేవి, చింతకాయల భారతి, తుమ్మలపల్లి సుశీల టిడిపిలో చేరగా, గత రెండు రోజుల క్రితం మరో ఇద్దరు కౌన్సిలర్లు టిడిపిలో చేరారు. శనివారం మరో ఐదుగురు కౌన్సిలర్లు టిడిపిలో చేరారు. దీంతో టిడిపిలో చేరిన వారి సంఖ్య 10కి చేరింది. టిడిపిలో చేరిన వారిలో కౌన్సిలర్లు బుడ్డిగ వెంకట దారేష్(12వ వార్డు) ఆచంట సురేష్(19వ వార్డు), పులి సత్యనారాయణ(24వ వార్డు), దోసపత్తి రాజేశ్వరి(29), సిద్దిరెడ్డి గౌరీవనజ(30వ వార్డు), కర్రి శ్రీదేవి(23వ వార్డు), చింతకాయల భారతి(28వ వార్డు), తుమ్మలపల్లి సుశీల(4వ వార్డు), నార్ల భువనేశ్వరి(18వ వార్డు), రాచబోయిన అప్పాయమ్మ(20) ఉన్నారు. మరి కొంతమంది కౌన్సిలర్లు తమ పార్టీలోకి చేరడానికి సిద్ధంగా ఉన్నారని టిడిపి నాయకులు ప్రకటించారు. తుని పట్టణ మున్సిపాలిటీ ఎన్నికలు ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం ఉండడంవల్ల ఎన్నికల అధికారులు రెండుసార్లు వాయిదా వేశారు. ఈ నెల 17 జరిగే వైస్ ఛైర్మన్ ఎన్నిక ఫలితం ఏవిధంగా ఉండబోతుంది అనేది ఆసక్తికరంగా మారింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ రాజా అశోక్‌బాబు, యనమల రాజేష్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఈనిగంటి సత్యనారాయణ, మోతుకూరు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### కూలి వచ్చేదెప్పుడు..?

ప్రజాశక్తి - రౌతులపూడి

ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు ఇవ్వాల్సిన కూలి డబ్బులు సకాలంలో అందడం లేదు. గత నెల 25వ తేదీ నుంచి ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 25 వేల మంది ఉపాధి కూలీలకు సుమారు రూ.62 లక్షలు జమ కావాల్సి ఉంది. అయితే నిధులు ఎప్పుడు జమవుతాయో అధికారుల నుంచి స్పష్టమైన సమాచారం లేకపోవడంతో కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత అధికారులు దృష్టి సారించి ఉపాధి కూలీలకు రావలసిన బకాయిలను తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

### పాదగయకు రూ.11.61లక్షల ఆదాయం

**పిఠాపురం:** కుక్కుటేశ్వర స్వామి దేవస్థానం(పాదగయ) హుండీలను దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారు వడ్డీ ఫణీంద్రకుమార్ సమక్షంలో శనివారం లెక్కించారు. రూ.11,61,650 ఆదాయం వచ్చిందని దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి కట్నాం జగన్మోహన్‌శ్రీనివాస్ తెలిపారు. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవస్థాన సిబ్బంది, సేవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పిడిఎఫ్ అభ్యర్థి విజయానికి కృషి



రమణరాజును కలిసిన పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి రాఘవులు

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యలపై నిత్యం పోరాడే పిడిఎఫ్ అభ్యర్థి డి.వి.రాఘవులు విజయానికి ప్రతీఒక్కరూ కృషి చేయాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. శనివారం పి డి ఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డి.వి.రాఘవులు ప్రచార కార్యక్రమంలో భాగంగా పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజును జవహర్ వీధిలోని వివేక్ భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాఘవులుకు ఆయన ఘనంగా స్వాగతం పలికారు. గత ఎన్నికల్లో ఐవి విజయం సాధిస్తే ప్రస్తుత ఎన్నికల్లో డి.వి.రాఘవులు విజయం సాధించడం ఖాయమన్నారు. పిడిఎఫ్ విజయం ప్రజాస్వామ్య ప్రగతికి చిహ్నమని అన్నారు. ఈ పర్యటనలో సిపిఎం నగర కార్యదర్శి పలివెల వీరబాబు, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

## న్యాయ అవగాహనా సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి దీప దైవకృప

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో శనివారం మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేదుల సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి కె.దీప దైవకృప పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సులో సైబర్ క్రైమ్, డౌరీ ప్రొటెక్షన్ యాక్ట్, విద్యా హక్కులు, మోటార్ వెహికల్ యాక్ట్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, దేశభక్తి, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, బాల్యవివాహాల నిర్మూలన చట్టం, సిఆర్‌పిసి మెయింటినెన్స్ యాక్ట్, గరల్ చైల్డ్ ఎడ్యుకేషన్, ఫండమెంటల్ రైట్స్ గ్యారంటీ, ఇండియన్ కాన్స్టిట్యూషన్, క్రిమినల్ పీనల్ కోడ్ తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ కె.రామకృష్ణయ్య, పలువురు న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, నవోదయ ఎన్‌సిసి ఆఫీసర్ సనపల సత్యనారాయణ, ఉపాధ్యాయులు చక్రవర్తి పాల్గొన్నారు.

### చట్టాలపై అవగాహన అవసరం




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మీకాంతం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఎస్ఐ ఎన్.లక్ష్మీకాంతం అన్నారు. శనిఆరం మండలంలోని ఒమ్మంగి జడ్‌పి ఉన్నత పాఠశాలలో మహిళా చట్టాలు, హక్కులు, బాల బాలికల రక్షణ, సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా ఆకతాయిలు మహిళలు, చిన్నారుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై మహిళా పోలీసులు వివరించారు. పాఠశాలలకు వెళ్లివచ్చే క్రమంలో రోడ్డుకు పక్కన నడిచి వెళ్లాలని సూచించారు. ప్రేమ పేరుతో వంచన చేసే నయవంచకుల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉచిత కంటి వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - పెద్దాపురం

క్లాప్స్ ఆధ్వర్యంలో స్థానిక కట్టమూరు పుంత రహదారిలోని కల్వరి మిరాకిల్ చర్చిలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని క్లాప్స్ సెక్రటరీ కె.నాగశ్రీనివాస్, కోశాధికారి ఎన్.సుకుమార్ సహాయం, ప్రతిభా స్కూల్ కరస్పాండెంట్ ఎస్‌వివి.ప్రకాష్ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ అమృత లాల్ వైద్య బృందం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 19 మందికి అపరేషన్ అవసరమని గుర్తించారు. మరో 26 మందికి కళ్ళజోళ్లు పడతాయని గుర్తించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జి.సత్యానందం, ఎల్.జ్ఞానానందం, జి.ఆనంద్‌సామ్యూల్, సిహెచ్.అనిల్‌కుమార్, మేరీ రాజకుమారి పాల్గొన్నారు.

## బెదిరింపులు, అరాచకాలు నా జీవితంలోలేవు

### మాజీ ఎంఎల్ఎ రాజా అశోక్‌బాబు

ప్రజాశక్తి- తుని

భయపెట్టడం, అరాచకాలు చేయడం తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ లేదని, తన గురించి తుని నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసని తుని మాజీ ఎంఎల్ఎ రాజా అశోక్ బాబు అన్నారు. శనివారం మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా తుని మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ ఎన్నికల్లో భాగంగా తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. జగన్ పాలంలో తుని పట్టణ మున్సిపాలిటీలో ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేకపోయామని, ఉన్నటువంటి కొద్ది సమయంలోనైనా కూటమి ప్రభుత్వంతో కలిపి తుని పట్టణాన్ని అభివృద్ధి చేయడానికి మీతో కలిసి పని చేస్తామంటూ కౌన్సిలర్లు మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎంఎల్ఎ దివ్య, తనను వచ్చి కలిశారన్నారు. ఈ మేరకే వారు టిడిపిలో చేరారన్నారు. వైసిపి హయాంలో తుని పట్టణంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, దానికి నిదర్శనంగా మొన్న జరిగిన ఎన్నికల్లో తుని పట్టణంలో 7,500 మెజార్టీ కూటమి ప్రభుత్వానికి వచ్చిందని గుర్తు చేశారు. విమర్శలు చేసే ముందు చరిత్ర తెలుసుకోవాలని హితవు పలికారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు, అధికారపక్షం కలిపి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. తుని పట్టణ మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ ఎన్నికల్లో అభ్యుదయ భావాల ఉన్న, మంచి వైస్ ఛైర్మన్ ఎన్నుకొని తుని పట్టణాన్ని అన్ని రంగాలలోనూ అభివృద్ధి పరచడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. గత ఐదేళ్ల జగన్ పరిపాలనకు ఎనిమిది నెలల కూటమి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని గ్రహించాలన్నారు.

## అలుగు జాతిని సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి - గండేపల్లి

పర్యావరణానికి దోహదం చేసే అలుగు జాతిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్ ఈశ్వర్ నారాయణ్ అన్నారు. శనివారం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీలో ప్రపంచ పంగోలిన్ డే సందర్భంగా అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంగోలిన్‌ని తెలుగులో అలుగు అంటారని, దీనిని ప్రపంచ వ్యాప్తంగా పెద్దఎత్తున అక్రమ రవాణా చేయడం వల్ల అలుగు జాతి అంతరించే జాబితాలోకి చేరిందన్నారు. అలుగు నాలుగు జాతులని, వీటి మనుగడ పర్యావరణానికి చాలా ఉపయోగకరం అని అన్నారు. భావితరాల మనుగడ కై మన అందరూ వాటిని సంరక్షించుకోవలసిన బాధ్యత ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్టర్ డాక్టర్ జి.సురేష్, డీన్ వి.సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ బి.రాంబాబు, రెహ్మాన్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




రైతులతో కలిసి పొలాలను పరిశీలిస్తున్న వాసంశెట్టి సత్య

### శివారు భూములకు నీరందించాలి

ప్రజాశక్తి - కాజులూరు

రబీలో సాగుచేస్తున్న శివారు భూములకు నీరు అందించాలని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్, కూటమి పార్టీల నాయకుడు వాసంశెట్టి సత్యం కోరారు. మండలంలోని శలపాక గ్రామ శివారు సాగు భూమి రైతులు సాగు నీటి ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలోనే శనివారం ఆయన రైతులతో కలిసి శలపాక శివారు భూములను పరిశీలించారు. శివారు భూములకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాజులూరు, సిరిపురం సాగునీటి పంపిణీ ఛైర్మన్లు కృష్ణచైతన్య, పేపకాయల నారాయణరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### కార్టూ'నిజం'




3,708 కాదు.. 7,577 బస్తాలు
గోదాములో మాయమైన బియ్యం లెక్క ఇదీ..

## పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి - యంత్రాంగం

**జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమాలు జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, ఆవరణల్లో పారిశుధ్య పనులను అధికారులు, సిబ్బంది చేపట్టారు.**

**కాకినాడ** జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిఆర్ఒ జె.వెంకటరావు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల్లో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యాలయాల్లో పారిశుధ్య పనులను చేపట్టారు. కంప్యూటర్లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వికాస పీడీ కె.లచ్చారావు, కలెక్టరేట్ ఎఒ రామ్మోహన్‌రావు, వివిధ విభాగాల అధిపతులు, పౌరసరఫరాలు, వికాస సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థుల స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల పరిసర ప్రాంతాల్లోని వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒలు టి.తేజేశ్వరరావు, ఐ.గౌరీప్రియ పాల్గొన్నారు. **గండేపల్లి** మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నాతి బుజ్జి, ఎస్ఐ యువి.శివనాగు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **సామర్లకోట** స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద జరిగింది. సబ్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో సిబ్బంది పారిశుధ్య పనులను చేపట్టారు. అనంతరం ఇఇ ప్రభాకర్ స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో ఎడిఇ కిరణ్, ఎఇ పి.రమేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎం.కమలకుమారి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతి, డాక్టర్ ఎం.పోచయ్య, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ కె.హరిబాబు, డాక్టర్ జోసెఫ్ స్టీఫెన్, డాక్టర్ గోపి, హేమలత, మణికంఠేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** స్థానిక ప్రభుత్వాసుపత్రిలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శైలజ మాట్లాడుతూ పెరిగిపోతున్న వాయు కాలుష్యాన్ని అరికట్టడానికి వన సంపదను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటి కో ఛైర్మన్లు జొన్నాడ వీరబాబు, వాగు రాజేష్, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ స్రవంతి, డాక్టర్ ఇతియాస్, డాక్టర్ లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక మహారాణి కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ జి.జ్యోతిర్మయి ఆధ్వర్యంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పరిశుభ్రతా కార్యక్రమాలు చేపట్టారు. కళాశాల ప్రాంగణంలో బ్యాటరీ వాహనాలు, సైకిల్స్ ప్రదర్శించారు. అలాగే తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో మండలంలోని జి.రాగంపేట గ్రామంలోని వర్మి కంపోస్టు యార్డ్ వద్ద పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **గొల్లప్రోలు** పట్టణంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ కమిషనర్ కనకారావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.రఘుప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. **పిఠాపురం** పట్టణంలో స్వచ్ఛతా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కనకారావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పురపాలక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపల్ ఎ. మురళీ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎం రేవతి,స్కిల్ హబ్ ట్రైనర్ వి. వీరబాబు, పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **కరప** మండలవలోని నడకుదురు స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ అన్నామణి, ఇఒపిఆర్‌డి సలాది వెంకట శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పెద్దాపురం - పాయకరావుపేట విద్యుత్ లైను మార్పు చేయనున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని ట్రాన్స్‌కో అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని మల్లవరం గ్రామంతోపాటు, వ్యవసాయ విద్యుత్ లైన్‌పై విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, కావున వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

### ఘనంగా కాలభైరవుడి తీర్థం

ప్రజాశక్తి - తాళ్లరేవు

చొల్లంగిపేట పంచాయతీ కొబ్బరి చెట్టు పేట గ్రామంలో కాలభైరవ తీర్థం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అప్పన్న ఎద్దుల ఊరేగింపు, ప్రదర్శన ఆకట్టుకున్నాయి. స్థానిక పెద్దలు, యాదవ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణం వద్ద కోల సంబరం నిర్వహించారు. కాలభైరవ తీర్థంకు వచ్చిన భక్తులకు పులిహోర, పరమాన్నం ప్రసాదంగా పంపిణీ చేశారు.

### వల్లభస్వామికి రూ.4.44 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతి గ్రామంలోని శృంగార వల్లభ స్వామికి శనివారం ఒకరోజు రూ.4,44,291 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ దర్శనం టికెట్ల ద్వారా రూ.3,09,900, అన్నదాన విరాళాల ద్వారా రూ.92,926, కేశఖండన ద్వారా రూ.7,400, తులాభారం ద్వారా రూ.550, లడ్డు ప్రసాదం ద్వారా రూ.33,615 వెరసి రూ.4,44,291 ఆదాయం సమకూరిందని తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణ ఆచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు, గ్రామస్తులు, యాత్రికులకు సహాయ సహకారాలు అందించారు.

## నేరాలు ఘోరాలు

### పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని రాజవరం గ్రామం శివారు పేకాడుతున్నారన్న సమాచారం మేరకు శనివారం సాయంత్రం ఎస్ఐ ఎస్.రాము తన సిబ్బందితో పేకాటశిబిరంపై దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఇద్దరు వ్యక్తులను అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,800 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

### అగ్నిప్రమాదంలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

గదిలో ఉన్న పెట్రోల్ బాటిల్ కిందపడి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఒక మహిళకు గాయాలయ్యాయి. శనివారం పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. లొల్ల గ్రామానికి చెందిన చిట్టూరి లక్ష్మీకాంతం(48). ఈమెకు ముగ్గురు సంతానం. భర్త చనిపోయి సుమారు 20 సంవత్సరాలు అవుతోంది. ఇంటి వద్ద కిరణా షాపు పెట్టుకుని జీవనం సాగిస్తోంది. శుక్రవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో ఇంటిలోని పెట్రోలు బాటిల్ లో ఉన్న పెట్రోల్ పొరపాటున ఒలిగి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో లక్ష్మీకాంతం చీర అంటుకుని మంటలలో కాలిపోతుండగా తల్లిని చూచి కుమారులు ఇద్దరు మంటలు ఆర్పడానికి ప్రయత్నం చేశారు. ఈ సమయంలో పెద్ద కుమారునికి, తల్లి లక్ష్మీకాంతంకు గాయాలయ్యాయి. వీరిద్దరినీ 108లో కొత్తపేట ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన వైద్యం కోసం కోసం రాజమహేంద్రవరం డాక్టర్లు సిఫారసు చేయడంతో ఇద్దరు చికిత్స పొందుతున్నారు ఆస్పత్రి నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

### అవివాహిత అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి.రాగంపేట గ్రామానికి చెందిన అవివాహిత అదృశ్యం అయినట్లు ఆమె కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.మౌనిక తెలిపారు.

### నిలిచిన తాగునీటి సరఫరా

ప్రజాశక్తి - గొల్లప్రోలు

నగర పంచాయతీ పరిధిలోని ఎస్‌సి కాలనీల్లో గత రెండు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా ప్రాంతాల ఎస్‌సి ప్రజలు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటునానరు. నీటి సరఫరా ఆగిపోయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కులాయిల ద్వారా సరఫరా ఆగిపోయినా ట్యాంకర్ల ద్వారా కూడా నీటిని సరఫరా చేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### క్లస్టర్ స్కూల్స్ బలోపేతానికి చర్యలు

ప్రజాశక్తి - సామర్లకోట, గండేపల్లి

క్లస్టర్ స్కూల్స్‌ను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని వేట్లపాలెం క్లస్టర్ హెచ్ఎం పి.అనురాధ తెలిపారు. శనివారం క్లస్టర్ ప్రారంభ సమావేశం వేట్లపాలెంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 117 జిఒను ప్రభుత్వం రద్దు చేసిందని, మూడు రకాల స్కూల్స్ ఏర్పాటు చేయడానికి ఆదేశాలు ఇచ్చిందన్నారు. రోల్ తక్కువ ఉన్న పాఠశాలను ఫౌండేషన్ స్కూల్‌గా మార్పు చేసిందన్నారు. రోలు ఎక్కువగా ఉన్న పాఠశాలలను మోడల్ స్కూల్‌గా మార్చిందన్నారు. క్లస్టర్ సమావేశాల్లో విద్యార్థుల ప్రగతి నివేదికలు ఇవ్వాలన్నారు. రాబోయే ఏడాదిలో విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ జాయింట్ సెక్రటరీ కెవిఆర్.చౌదరి, క్లస్టర్ స్ట్రాంగ్ టీచర్లు ఎం.నాగరాజు, జి.చక్రవర్తి, హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గండేపల్లి మండలంలో పలు ప్రాంతాల్లో క్లస్టర్ల వారీగా ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం శనివారం జరిగింది. గండేపల్లి క్లస్టర్ సమావేశం స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలోనూ, మల్లేపల్లి క్లస్టర్ సమావేశం ఉన్నత పాఠశాలలోనూ, కె.నాయకంపల్లి క్లస్టర్ సమావేశం ఉన్నత పాఠశాలలో జరిగింది. గండేపల్లి క్లస్టర్ సమావేశంలో ఎంఇఒ కెహెచ్.నాయక్, హెచ్ఎం వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు.

### పచ్చదనాన్ని పెంపొందించాలి

ప్రజాశక్తి -గోకవరం

ప్రతి ఒక్కరూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని గోకవరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వనజాకుమారి అన్నారు. శనివారం గోకవరం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సూపరింటెండెంట్, అభివృద్ధి కమిటీ కన్వీనర్ డాక్టర్ వనజాకుమారి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు డాక్టర్ యూన్‌సీరాణి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### సాంకేతిక పరిజ్ఞానంతో చోరీల కట్టడి

ప్రజాశక్తి - కాజులూరు

సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని చోరీలను కట్టడి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎఎస్‌పి పాటిల్ దేవరాజ్ మనిష్ అన్నారు. శనివారం మండలంలోని కోలంక గ్రామంలో ఇటీవల జరిగిన గొలుసు చోరీ సంఘటన స్థలాలను ఆయన పరిశీలించారు. చోరీకి గురైన మహిళల నుంచి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చోరీ సంఘటన జరగకుండా ముఖ్య కూడళ్ళలో సిసి కెమెరాలు ఏర్పాటుకు ప్రభుత్వానికి నివేదిక పంపామని, అప్పటివరకు స్థానికంగా ఉన్న వ్యాపారస్తులు, ప్రజా ప్రతినిధులు, దాతల సహకారంతో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో కొత్తగా ఎవరు వచ్చినా వారిపై నిఘా ఉంచాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో చోరీలు అరికట్టేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ పర్యటనలో సిఐ కృష్ణచైతన్య, గొల్లపాలెం ఎస్ఐ మోహన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### ఫార్మర్ రిజిస్ట్రేషన్ అవసరం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీపై అందించే పథకాలకు రైతు విశిష్ట సంఖ్య కోసం రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయకుమార్ అన్నారు. శనివారం మండలంలోని చేబ్రోలు, మల్లవరం గ్రామాల్లో ఆర్ఎస్‌కెలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1.34 లక్షల మంది సొంత భూమి కలిగిన రైతులు ఉన్నారని, ఇప్పటివరకు 61 వేల మంది రైతులు మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. మిగిలిన రైతులు వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

# పట్టభద్రుల్లో పట్టు కోసం...

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పట్టభద్రుల భవిష్యత్తును దిశానిర్దేశం చేసే ఎన్నికలు సమీపిస్తున్నాయి. ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎంఎల్‌సి బరిలో 35 మంది అభ్యర్థులు తలపడుతున్న విషయం విధితమే. పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల రాఘవులతో పాటు కూటమి, రిఫార్మ్ పార్టీ ఆఫ్ ఇండియాతో పాటు మరో 32 మంది స్వతంత్ర అభ్యర్థులు పోటీలో నిలిచారు. పట్టభద్రుల భవిష్యత్తును నిర్దేశించే ఈ ఎన్నికల్లో అధికార యంత్రాంగం ఏకపక్షంగా వ్యవహరిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించిన అధికారులు తాజాగా అపఖ్యాతి మూటకట్టుకోవటం అభ్యర్థులతో పాటు ఓటర్లను ఆందోళనకు గురి చేస్తుంది. కూటమి అభ్యర్థి నామినేషన్ మొదలుకొని ఇప్పటి వరకూ ఎన్నికల కోడ్ ఉల్లంఘించినా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కూటమి అభ్యర్థి ఓటర్లకు రవాణా ఛార్జీలు అందజేయడం, ఓటర్ల ఫోన్ నెంబర్ల జాబితా సేకరించడం వంటివి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. సోషల్‌మీడియాలో సైతం వార్తలు చక్కర్లు కొట్టాయి. అధికార యంత్రాంగం ద్వంద వైఖరికి ఇటువంటి ఉదాహరణలు దర్పణం పడుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటికైనా పునరాలోచించి నిస్పక్షపాతంగా వ్యవహరించాలని ఓటర్లు కోరుతున్నారు.

**పిడిఎఫ్ అభ్యర్థికి పెరుగుతున్న ఆదరణ**

పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీరరాఘవులుకు రోజురోజుకూ పట్టభద్రుల్లో ఆదరణ పెరుగుతోంది. పలు ప్రజా సంఘాల నాయకులు స్వచ్ఛందగా ముందుకొచ్చి రాఘవులు గెలుపుకోసం ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సమస్యలపై శాసన మండలిలో గళం వినిపించి విజయ కేతనం ఎగుర వేసిన చరిత్ర పిడిఎఫ్ సొంతం. ఇటీవల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థి గురుమూర్తి విజయఢంగా మోగించిన విషయం విధితమే. ఉపాధ్యాయ సంఘాలు ఏకతాటిపైకి వచ్చి తమ గళం వినిపించే అభ్యర్థిని మొదటి ప్రాధాన్యతా ఓటుతోనే గెలుపు శిఖరాలను దరిచేర్చారు. తాజాగా పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లోనూ అదే పునరావృతం కానుందని విశ్లేషకులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అనేక హామీలు ఇచ్చిన విషయం విధితమే. అధికారంలోకి వచ్చిన 8 నెలల్లో ఏ ఒక్క హామీని అమలు చేయలేదు. మరో వైపు ఉద్యోగులకు కనీసం ఒక్క డిఎ కూడా ఇవ్వలేదు. కొత్త పిఆర్‌సి కమిషన్‌ను సైతం వేయలేదు. దీంతో ప్రభుత్వంపై ఆయా వర్గాలు సంతృప్తికరంగా లేవు. ఈ నేపథ్యంలో పోరాట చరిత్ర కల్గిన పిడిఎఫ్ అభ్యర్థికి అన్ని వర్గాల నుంచి ఆదరణ లభిస్తోంది.

**భయ పెడుతున్న బర్డ్ ఫ్లూ**

బర్డ్ ఫ్లూ జిల్లా ప్రజలను భయపెడుతోంది. జిల్లాలోని పెరవలి మండలం కానురులోని పౌల్ట్రీలో కోళ్ల మృత్యువాతకు బర్డ్‌ఫ్లూ కారణమని శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు. ఈ నేపథ్యంలో పశుసంవర్ధక శాతతో పాటు వైద్య ఆరోగ్య శాఖ సైతం అప్రమత్తమైంది. జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపడుతోంది. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. మనుషులకు సైతం వ్యాధి వ్యాపిస్తుందనే ప్రచారం ఊపందుకుంది. మరోవైపు చికెన్, గుడ్ల విక్రయాలపైనా తీవ్ర ప్రభావం పడింది. రెడ్ జోన్ పరిధిలో ఇప్పటికే చికెన్‌షాపులు మూతపడిన విషయం విధితమే. పట్టణ ప్రాంతాల్లోనూ మాంస ప్రియులు చికెన్ కొనుగోలు చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. దీంతో ధరలు పాతాళంలోకి చేరాయి. ఫలితంగా పౌల్ట్రీ రంగానికి మరో ఎదురు దెబ్బ తగినట్లైంది. ఇటువంటి విపత్తుల నుంచి ప్రభుత్వమే ఆదుకోవాలని పౌల్ట్రీ నిర్వహకులు కోరుకుంటున్నారు. నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.




**పెరుగుతున్న ఉష్ణోగ్రతలు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎండలు క్రమ క్రమంగా పెరుగుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. మధ్యాహ్నానికి వేడి గాల్పులు ఊపందుకోవటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పటంలేదు. ఫిబ్రవరి రెండవ వారంలోనే ఇలా ఉంటే మే నెలలో తారాస్థాయికి చేరతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. దీనికి తోడు అనధికార విద్యుత్ కోతలు గోరుచుట్టుపై రోకలి పోటులా మారాయి. ఉమ్మదీత, ఉక్కపోతతో ప్రజలు అవస్థలుపడుతున్నారు. పాలనా యంత్రాంగం ఇప్పటికైనా చొరవ చూపి అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా అందించాలని ప్రజలు కోరుతున్నారు.

# ఉపాధ్యాయునితోనే బోధన సాధ్యం

## విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ అబ్రహాం
## క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

టెక్నాలజీ ఎంత మారినా విద్యార్థులకు టీచర్ ద్వారానే బోధన సాధ్యం అని, టెక్నాలజీ టీచర్‌కు ప్రత్యామ్నాయం కాలేదని రాష్ట్ర విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.అబ్రహాం అన్నారు. స్థానిక లాలా చెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలను అయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అబ్రహాం మాట్లాడుతూ..పాఠశాలల్లో ఎన్‌రోల్ మెంట్‌పై దృష్టి సారించాలన్నారు. బడి ఈడు బాలబాలికలు విధిగా బడిలోనే ఉండాలన్నారు. ఉపాధ్యాయులు బోధనలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆసక్తికరమైన తరగతి గదిని రూపొందించాలన్నారు. ఉపాధ్యాయులతో కలిసి ఆన్‌లైన్ సెషన్‌లో కమిషనర్ సూచనలు వెబెక్స్ ద్వారా విన్నారు. జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు మాట్లాడుతూ పభుత్వ పాఠశాలలకు ఎక్కువగా పేదపిల్లలే వస్తారన్నారు. వారి అభ్యున్నతికి పాటు పడాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా క్లస్టర్‌లుగా విభజించి ఒకో క్లస్టర్‌లో కనీసం 10 పాఠశాలలు ఉండేలా చేశారన్నారు. ఇక నుంచి ఈ క్లస్టర్ సమావేశాలు ప్రతినెలా మూడవ శనివారం ఒకరోజు మాత్రమే జరుగుతాయన్నారు. ఒకవేళ మూడవ శనివారం సెలవైతే నాల్గవ శనివారం జరుగుతాయన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ క్లస్టర్ సమావేశాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, క్లస్టర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అత్యంత శ్రద్ధగా వీటిని నిర్వహించాలన్నారు. క్లస్టర్ సమావేశాల పరిశీలనకు నోడల్ అధికారులను నియమించామన్నారు. అజెండా ప్రకారం కార్యక్రమాలను నిర్వహించి, కార్యాలయానికి రిపోర్ట్ పంపించాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్లస్టర్ సమావేశంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

### 3వ రోజు అంగన్‌వాడీల శిక్షణ

ప్రజాశక్తి -దేవరపల్లి

మండలంలోని యర్నగూడెం హై స్కూల్లో అంగన్‌వాడీలకు నిర్వహిస్తున్న శిక్షణ శనివారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. వికలాంగ పిల్లల స్క్రీనింగ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సెంటర్లో ఉన్న పిల్లల్లో అభివృద్ధి ఆటంకాలు ఉన్నవారిని, వైకల్యాలు ఉన్నవారిని ముందుగా ఏలా గుర్తించాలి, అభివృద్ధి మైలురాళ్లలో జాప్యం తెలుసుకోవడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, శశికళ, విజయశాంతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆసుపత్రిని శుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - కడియం

ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని కడియం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ జి.రత్నమాధురి రోగులకు, వారి సహాయలకు, సిబ్బందికి సూచించారు. స్వచ్ఛత కార్యక్రమం, మెడికల్ క్యాంప్‌లో భాగంగా ఆసుపత్రి శానిటేషన్ సిబ్బందికి శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వార్డుల్లో వివిధ రంగుల డస్ట్ బిన్ల గురించి, ఏ డస్ట్ బిన్లలో ఏ వ్యర్థాలు ఎలా వెయ్యాలో శానిటేషన్ సిబ్బందికి, వార్డుల్లోఉండే రోగుల సహాయకులకు వివరించారు. నర్సింగ్, పారామెడికల్, శానిటేషన్ సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. నిత్యం ఆసుపత్రిని, ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు.

# సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

ఆలిండియా సివిల్ సర్వీసెస్ పురుషుల, మహిళల హాకీ టోర్నమెంట్ శనివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది.కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, ఎస్‌పి జి.బిందుమాధవ్, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ హెచ్ఎస్.భావన, అర్జున అవార్డు గ్రహీతలు ఎన్.మహమ్మద్ రియాజ్, పద్మశ్రీ ఎన్.ముఖేష్‌కుమార్, సివిల్ సర్వీసెస్ క్రీడల బోర్డు కన్వీనర్ రాజ్‌కుమార్ వర్మ పాల్గొన్నారు. డిఎస్ఎ క్రీడా మైదానంలోని హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ విగ్రహానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే జాతీయ పతాకాన్ని, టోర్నమెంట్ పతాకాన్ని, రాష్ట్ర పతాకాన్ని ఆవిష్కరించారు. వివిధ రాష్ట్రాలు, ప్రాంతీయ క్రీడల బోర్డులకు ప్రాతినిధ్యం వహిస్తూ టోర్నమెంటులో పాల్గొంటున్న 44 హాకీ జట్లు మార్చ్ పాస్ట్ నిర్వహించాయి. టోర్నమెంట్‌ను ప్రారంభ సూచికగా కలెక్టర్ షాన్‌మోహన్ బెలూన్లను ఎగురవేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌కు ఆతిధ్యం ఇచ్చే అవకాశం కల్పించినందుకు సివిల్ సర్వీసెస్ స్పోర్ట్స్ బోర్డ్‌కు ధన్యవాదాలు తెలిపారు. టోర్నమెంట్లో పాల్గొంటున్న క్రీడాకారులందరికి స్వాగతం పలికారు. క్రీడా స్ఫూర్తితో ఈవెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు. క్రీడలతో పాటు కాకినాడ జిల్లాలోని ప్రముఖ పర్యాటక, ఆధ్యాత్మిక ప్రదేశాలను కూడా క్రీడాకారులందరూ తిలకించాలని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. తొలిసారి ఈ టోర్నమెంట్ను నిర్వహిస్తున్నామని, ఆతిధ్యం, ఆహారం వంటి అంశాలకు సంబంధించి ఏవైనా లోపాలు ఉంటే సర్దుకోవాలని కోరారు. టోర్నమెంట్ నిర్వహణలో వివిధ అంశాలను స్పాన్సర్ చేస్తూ ఆర్థిక సహకారాన్ని అందించిన కార్పొరేట్, వ్యాపార, పారిశ్రామిక సంస్థలు అన్నింటికి ఆయన పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జనవరి 28 నుంచి ఫిబ్రవరి 14 వరకు జరిగిన 38వ జాతీయ క్రీడలు-2025లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి మొట్టమొదటిసారిగా జిమ్నాస్టిక్స్ విభాగంలో బంగారు పతకం సాధించిన కాకినాడ జిల్లా క్రీడాకారిణి ఎస్‌కె.యాసిన్‌ను, కోచ్ సురేష్‌ను ఈ సందర్భంగా సత్కరించారు.



తలపడుతున్న జట్లు




ప్రారంభోపన్యాసం చేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

**తొలి రోజు విజేతలు**

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్-2025 తొలిరోజు నిర్వహించిన పోటీల్లో హిమాచల్ ప్రదేశ్-హర్యానా జట్ల మధ్య పోటీ జరిగింది. ఈ పోటీలో హర్యానా 14-0 తేడాతో హిమాచల్ ప్రదేశ్ జట్టుపై విజయం సాధించింది.కర్ణాటక- పాండిచ్చేరి జట్ల మధ్య జరిగిన రెండో మ్యాచ్లో పాండిచ్చేరి 10-1 తేడాతో కర్ణాటక రాష్ట్రంపై విజయం సాధించింది.

# ముగిసిన రహదారి భద్రతా మాసోత్సవాలు

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక కలెక్టరేట్ నందు శనివారం 36వ జాతీయ రహదారి భద్రత మాసో త్సవాలు-2025 ముగింపు సమావేశం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధ్యక్షతన ఆటో డ్రైవర్లు, వివిధ కళాశాలల విద్యార్థిని, విద్యార్థులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రహదారి భద్రత నిరంతర ప్రక్రియని వాహన చోదకులు, పాదచారులు నిత్యం రహదారి నియమాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనదారులు తమ వాహనాన్ని నడిపేటప్పుడు రహదారి భద్రతా నియమ నిబంధనలు పాటించి ప్రమాదాలను నియంత్రించాలని, వాహనదారులు నడిపే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రహదారి భద్రతపై వాహనదారులకు అవగాహన పెంపొందించాలన్నారు. రహదారి భద్రతలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కోనసీమ జిల్లాలో భౌగో ళిక పరిస్థితులను బట్టి కాలువ గట్ల రోడ్లపై పయనించేటప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ఉదయాన్నే విపరీతమైన మంచుతో రోడ్లు ఉన్నాయని ఆ సందర్భంలో కూడా వాహనదారులు మరింత జాగ్రత్తగా వాహనాలను నడపాలన్నారు. కళాశాల విద్యార్థిని, విద్యార్థులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి వాహనాన్ని నడపాలన్నారు. నాలుగు చక్రాల వాహనాదారులు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ను ధరించాలని వాహన దారులు మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. ముఖ్యంగా వాహనాదారులు సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనా లు నడపడం ఎంతో ప్రమాదకరమన్నారు. అధిక వేగం రాష్ డ్రైవింగ్ అత్యంత ప్రమాదకరమన్నారు.అదేవిధంగా ఆటో రిక్షా లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదని ఆటో డ్రైవర్లకు తెలియజేశారు. కళాశాలలో అవగాహన సదస్సులు కల్పించడంతో పాటు అర్హులైన వారికి డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేయాలని సూచించారు. ప్రమాదాలు సంభవించిన వెంటనే గుర్తించి క్షతగాత్రులకు కొరకు 108 అత్యవసర వైద్య సేవలు వాహనానికి కాల్ చేయడం ప్రాథమిక చికిత్సలకు సిఫార్సు చేసి ఆదుకున్న వారికి కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని తెలిపారు. వాహన దారులకు రహదారి భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కల్పించడం జరిగిందని స్థానిక రవాణా శాఖ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు.. డ్రాయింగ్ వ్యాసరచన పోటీలలో విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మోటారు వాహనాల తనిఖీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసు, కాశి లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు మొక్క అందజేస్తున్న రవాణాశాఖాధికారి తదితరులు



పంపిణీ చేస్తున్న నామన ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాంబాబు

### నామన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు చీరల పంపిణీ

ప్రజాశక్తి,- మామిడికుదురు

నామన పౌండేషన్ ద్వారా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వ్యవస్థాపకులు జడ్‌పి మాజీ ఛైర్మన్ నామన రాంబాబు అన్నారు మగటపల్లిలో నామన కృష్ణవేణి జ్ఞాపకార్థం 100 మంది పేద మహిళలకు శనివారం చీరలు అందజేశారు. డాక్టర్లు నామన వినోద్, నామన శృతి ల ఆధ్వర్యంలో పేదలకు అండగా నిలవాలని సంకల్పంతో ఈ సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొలిశెట్టి జయరామ్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు బొలిశెట్టి ప్రభుదాస్, సరెళ్ల సత్యనారాయణ, కుంపట్ల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

ప్రస్తుత రబీ సీజన్లో సాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు సుమారు రూ.1 కోటి8 లక్షలతో డ్రెయినేజీలపై అడ్డుకట్టలు వేసి ఆయిల్ ఇంజన్ల ద్వారా సాగునీటిని సరఫరా చేయడం, కాలువల గేట్ల షట్టర్లు మరమ్మతులు, కాలువ గండ్లు పూడ్చుటం వంటివి చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ వెల్లడించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ నందు జల వనరులు డ్రెయినేజీ విభాగ ఇంజినీర్లు వ్యవసాయ శాఖ అధికా రులతో సంయుక్తంగా సాగునీటి ఎద్దడిని అధిగమించే విధి విధానాలపై సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత రబీ సీజన్లో 1,65,000 ఎకరాలు సాగులో ఉందని, ఈ యొక్క సీజన్ మార్చి నెలాఖరులో గోదావరి నది ఎగువ భాగంలో నీటి ప్రవాహం తగ్గి సాగునీటి ఎద్దడి సమస్యలు ఉత్ప న్నమయ్యే అవకాశాలు ఉన్న దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేపట్టా మని తెలిపారు. సాగు నీటి ఎద్దడిని అధిగమించేందుకు 70 ప్రాంతాలను గుర్తించి డ్రెయినేజీలలో 41 పనులు కొరకు రూ.92 లక్షల అంచనాలతో డ్రైనేజీ విభాగం ద్వారా ప్రతిపా దనలను సమగ్ర వివరాలతో రూపొందించామన్నారు. త్వరలో అంచ నాలు రూపొందించి పనులకు పరిపాలన ఆమోదం నిధులు మంజూరు చేస్తామన్నారు. జలవనరుల విభాగం ద్వారా కాలువ గేట్ల షట్టర్ల మరమ్మత్తు లు గండ్లు పూడ్చడం కొరకు 11 పనులను రూ.16 లక్షలతో నిర్వహిం చేందుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ఈ యొక్క పనులను వ్య వసాయ శాఖ డ్రైనేజీ జలవనరుల శాఖ పర్యవేక్షణలో నీటి వినియోగదారుల సంఘాల కు నామినేషన్ ప్రాతిపదికన అప్పగించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వారాబంది విధానాన్ని పటిష్టంగా అమలు చేస్తూ సాగునీటి వినియోగాన్ని గరిష్టతరం చేయాలన్నారు. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలలో వరి నాట్లు ముందుగా వే యడం వల్ల పంట కోతకు ముందుగానే వస్తుందని ఆ నియోజకవర్గాల్లో పెద్దగా నీటి ఎద్దటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు. తూర్పు డెల్టాలో పంట కోత ముందుగా వస్తుందన్నారు. ఆ యొక్క నీటిని సెంట్రల్ డెల్టాకు మళ్లించాలని ఇంజనీర్లకు సూచించారు. ఐ.పోలవరం మండలంలో 33, కాట్రేనికోనలో 4, అల్లవరంలో 5, ఉప్పలగుప్తంలో 4 మల్కిపు రంలో 3, సఖినేటిపల్లి లో 3, రాజోలు 3, మామిడికుదురులో 3, కొత్తపేటలో 2, కె.గంగవరంలో 3, కాజులూరులో 1, రాయవరంలో 1 ఆలమూరులో 2, కపిలేశ్వర పురంలో 1, రామచంద్రపురం మండలంలో 1 డ్రెయి నేజీ పనులను ప్రతిపాదిం చినట్లు తెలిపారు. కార్యక్ర మంలో జెసి టి.నిషాంతి, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, డ్రెయినేజీ విభాగం కార్య నిర్వా హక ఇంజినీర్ ఎంవివి.కిషోర్, జల వనరులశాఖ డివిజన ల్ ఇంజినీర్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.